క్లుప్తంగా

300 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ కె. మురళీమోహన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శిబిరానికి అపోలో ఆస్పత్రి యాజమాన్యం సహకరించిందని పేర్కొన్నారు. సుమారు 300 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ నిఖిల్, డాక్టర్ కల్యాణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సీహెచ్ ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలపై యాజమాన్యంతో చర్చ


హెచ్‌పీసీఎల్ అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: భారీ క్రేన్ కాంట్రాక్టర్లకు బ్రిడ్జి అండ్ ట్రూఫ్ సంస్థ బకాయిలు ఉందని, ఆ మొత్తాన్ని సంస్థ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని హెచ్‌పీసీఎల్ ఈడీ రతన్‌రాజ్‌తో ఎమ్మెల్యే పి.గణబాబు చర్చించారు. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనులు చేపడుతున్న బ్రిడ్జి అండ్ ట్రూఫ్ సంస్థ భారీ క్రేన్లను లీజుకు తీసుకుంది. అయితే బకాయిలు భారీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే మంగళవారం హెచ్‌పీసీఎల్ అధికారులతో సమావేశమై బకాయిలు విడుదల చేసేలా బ్రిడ్జి అండ్ ట్రూఫ్ సంస్థకు ఆదేశాలివ్వాలని కోరారు.

ఘనంగా మోదకొండమ్మ నెల పండగ


మోదకొండమ్మ ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: స్థానిక ఇందిరానగర్‌లోని మోదకొండమ్మ అమ్మవారి నెల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పాల్గొన్నారు. తొలుత అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు ఉల్లూరి ప్రకాశరావు, కోనేటి నూకరాజు, జి. సూరిబాబు, రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్యామ్‌కు సత్కారం


శ్యామ్‌బాబును సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

మల్కాపురం: గాయకుడు, హెచ్‌యార్డ్ ఉద్యోగి రెడ్డి శ్యామ్‌బాబును స్థానిక వనితా వాకర్స్ క్లబ్ సంస్థ నిర్వాహకులు మంగళవారం సత్కరించారు. శ్యామ్‌బాబు పలు కార్యక్రమాల ద్వారా వివిధ సినీ, జానపద గీతాలు ఆలపించి పలువురి మన్ననలు అందుకున్నారు. క్లబ్ 21వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలో జరిగిన కార్యక్రమంలో శ్యామ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా శ్యామ్‌బాబు పలు తెలుగు సినిమాలకు సంబంధించిన పాటలు పాడి ఆహూతులను అలరించారు.

శభాష్ వలంటీర్

కరోనా వైరస్ భయపెడుతున్నా... తుపాను వచ్చినా... ప్రతిపక్షాలు విమర్శిస్తున్నా... వలంటీర్లు వెన్నుచూపలేదు. ఎక్కడా వెనక్కి తగ్గలేదు. కరోనా కష్టకాలంలో అందరూ ఉన్నా ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నవారి వద్దకు వెళ్లి భరోసా కల్పించారు. లక్షలాది మంది ప్రాణాలను కాపాడారు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారక ముందే అవ్వాతాతల ఇంటి తలుపు తట్టి పింఛను అందిస్తున్నారు. అర్హత గల తల్లికి అమ్మఒడి..అక్కచెల్లెమ్మలకు ఆసరా, చేయూత... నిరుపేదలకు నివేశ స్థలం.. పక్కా ఇళ్లు... విద్యార్థులకు విద్యా దీవెన... ఇలా ఒకటేమిటి సంక్షేమ పథకాలన్నీ ప్రజల గడప వద్దకే చేరుస్తూ శభాష్ వలంటీర్ అని అందరి మన్ననలు పొందుతున్నారు. వలంటీర్ల వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలిపారు.

– కంచరపాలెం

ఒకటో తేదీనే పింఛన్ అందుకుంటున్నా..



వలంటీర్ల సేవలకు విలువ కట్టలేం. కంచరపాలెం రాంజీ ఎస్టేట్ 270 సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ రాజేష్ ప్రతినెలా ఒకటో తేదీనే మా ఇంటికి వచ్చి పింఛను సొమ్ము అందిస్తున్నాడు. మా యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నాడు. మా కుటుంబ సభ్యుడి మాదిరిగా మా కష్టాలను అడిగి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాడు. ఈ వ్యవస్థ ఎంతో బాగుంది. పెన్షన్ ఎప్పుడిస్తారో ఎవరి దగ్గరికి వెళ్లాలో తెలియని పరిస్థితి నుంచి ఒకటో తేదీనే ఇంటికే పింఛన్ వచ్చే పరిస్థితి కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నా..

– పి.సాయిబాబా

అసిస్టెంట్ ప్రొఫెసర్.. ఈ వలంటీర్

బోని యామిని యశోద..విద్యావంతురాలు..ఓ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అంతే కాకుండా కంచరపాలెం 285 సచివాలయం గొల్లకంచరపాలెంలో వలంటీర్‌గా సేవలు అందిస్తున్నారు. తనకు అప్పగించిన 50 ఇళ్లను రోజూ సందర్శించి సంక్షేమ పథకాలను వివరించి అర్హులకు అందేలా చేస్తున్నారు. ఇక ప్రతి నెలా 1వ తేదీ ఉదయం 5 గంటలకే తన పరిధిలో ఉన్న ఇంటింటికీ పెన్షన్ అందజేస్తున్నారు. తండ్రి బోని రవికుమార్ ప్రోత్సాహంతో వలంటీర్‌గా వచ్చే గౌరవ భృతిని పలు సేవా కార్యక్రమాలకు వినియోగిస్తూ మన్ననలు పొందుతున్నారు.

సేవా దృక్పథంతోనే..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ చాలా గొప్పది. అందుకే సేవకురాలిగా చేరా. పీహెచ్‌డీ పూర్తి చేసి ఓ ప్రైవేటు కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ జగనన్న సైన్యంలో వలంటీర్‌గా చేరా.

– బోని యామిని యశోద, వలంటీర్, గొల్లకంచరపాలెం.



లబ్ధిదారుకు పెన్షన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ బోని యామిని యశోద (ఫైల్)

చేపల బజారులో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు


గోపాలపట్నం చేపల బజారులో తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు కొలతల అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద ఉన్న చేపల బజారులో లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. తూనికల్లో మోసాలకు పాల్పడుతున్న 7మంది వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్ఎం రాధాకృష్ణ మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ విశాఖ జిల్లా డిప్యూటీ కంట్రోలర్ బి. మనోహర్ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని తెలిపారు. వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాటా సరిగా ఉందా... సరుకు వేసినపుడు సున్నాలు చూపిస్తుందా..వంటివి పరిశీలించాలని సూచించారు. తూనికల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆయనతో పాటు తూనికలు కొలతల విభాగం ఇన్‌స్పెక్టర్ ఉమా సుందరి, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుదల


సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత విద్యాధికారి వైజయంతిమాల

డాబాగార్డెన్స్ : పౌష్టికాహారం తీసుకుంటే వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని, తద్వారా మనిషి ఆరోగ్యంగా ఉండవచ్చని విశ్రాంత విద్యాధికారి డాక్టర్ కె. వైజయంతిమాల అభిప్రాయపడ్డారు. నగరంలోని ఏవీఎన్ కళాశాలలో ఆ కళాశాల ఉమెన్ అసోసియేషన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పోషకాహార విలువలపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విటమిన్లు, కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లను ఆహారంగా తీసుకోవాలన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగ మెడిటేషన్ సెంటర్ ప్రతినిధి బీకే శివజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ప్రశాంతతకు రాజయోగ, మెడిటేషన్ అభ్యసించాలని, తద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. విద్యార్థులతో రాజయోగ మెడిటేషన్ చేయించారు. బ్లడ్‌డోనర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎస్. రాజకుమారి మాట్లాడుతూ బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందని, బెల్లం, చెరకు, ఖర్జూరం, ఐరెన్ పదార్థాలు తీసుకోవడం ద్వారా రక్త శాతం పెరుగుతుందని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ పాశ్చాత్య దేశాల ఆహారపు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని, మన దేశంలో పండే ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసుల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. జంక్‌ఫుడ్స్ తినడం వల్ల యువత ఆరోగ్యం పూర్తిగా దెబ్బ తింటుందన్నారు. సదస్సులో కళాశాల అధ్యాపకులు పి. కృష్ణకుమారి, డాక్టర్ ఎ. అర్చన, పైడి రజని, ఉమెన్ అసోసియేషన్ అధ్యక్షురాలు స్వరాజ్యలక్ష్మి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారుడి సృజన.. ప్రకృతి అనుసృజన


నీటిలో అడుగేయడానికి ఇబ్బంది పడుతున్నట్లు..

జగదాంబ : ఓ కళాకారుడి చేతి నుంచి జాలువారిన చిత్రం.. అక్కడి నేపథ్యం చూడగానే ఆలోచింపజేసేలా ఉంది. నీటిలో నుంచి వస్తున్న బాలుడు మళ్లీ ఆ నీటిలోనే అడుగేయడానికి ఇబ్బంది పడుతున్నట్టు కన్పిస్తోంది. కురుస్తున్న వర్షానికి ఆ చిత్రం ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై నీరు చేరి ఉంది. నీటిలో నిలబడి ఉన్న ఆ బాలుడు బయటికి వచ్చి నీటిలో అడుగేయాలా? వద్దా అని ఆలోచిస్తున్న భావన కల్పిస్తోంది.

సమస్యలపై సంఘటితంగా పోరాడాలి


ఇన్‌చార్జిలను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

డాబాగార్డెన్స్ : బ్రాహ్మణులందరూ సంఘటితంగా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఏపీ ప్రైవేట్ అర్చక పురోహిత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సతీష్ శర్మ పిలుపునిచ్చారు. నగరంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ సమావేశ మందిరంలో మంగళవారం సంఘం విశాఖ శాఖ తృతీయ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పురోహితులు, అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. భవిష్యత్ ఎన్నికల నేపథ్యంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో త్వరలో భేటీ కానున్నట్టు తెలిపారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రావూరి సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేసి సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌శర్మ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 25 మంది ఇన్‌చార్జిలు ఉత్సాహంగా పని చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సంఘానికి ఉత్తమ సేవలందిస్తున్న ఇన్‌చార్జిలను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆదిభట్ల కాశీదాసు, జిల్లా కార్యదర్శి మావుడూరు సంపత్‌కుమార్, సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాధవశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అప్పన్న నిత్యకల్యాణం


జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

స్థానిక సమస్యల పరిశీలన


కొత్తపాలెంలో కాల్వను పరిశీలిస్తున్న గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పశ్చిమసమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ పలు ప్రాంతాల్లో కాలువలు, కల్వర్టులను పరిశీలించారు. వార్డులో సుమారు రూ.కోటి జీవీఎంసీ నిధులతో పనులు చేస్తున్నామన్నారు. ప్రజలకు అవసరమైన రహదారులు, ఇతర అభివృద్ధి పనులను గుర్తించి ఆడారి ఆనంద్‌కుమార్‌కు నివేదిక ఇస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు


రైలు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్ ఫారం వద్ద రాయ్‌పూర్ విశాఖపట్నం ట్రైన్ ఢీకొట్టడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. ఉత్తర సింహాచలం నుంచి సింహాచలం వస్తున్న రాయ్‌పూర్ నుంచి విశాఖపట్నం వెళ్తున్న రైలు ఢీకొట్టడంతో కాలు, తలకు గాయాలయ్యాయి. ఈ వ్యక్తి మద్యం సేవించి ఉన్నాడు. రైలు ట్రాక్ దాటుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన రైల్వే పోలీసులు 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అయితే క్షతగాత్రుడు నరవకు చెందిన శివాజీగా గుర్తించారు. ఆ యువకుడి మానసిక పరిస్థితి కూడా బాగా లేదని చెప్పారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో వేంజేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన


కళా ప్రదర్శన ద్వారా స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పిస్తున్న మిమిక్రీ రాజా తదితరులు

డాబాగార్డెన్స్ : స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం 49, 50, 51 వార్డుల్లో కళా బృందాలచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో కళాకారుడు వైకే రాజు కళా బృందంచే ప్లాస్టిక్ నిషేధం, చెత్తపై చిత్తశుద్ధి, పరిసరాల పరిశుభ్రత, ఏకో–వైజాగ్ తదితర అంశాలపై వీధి నాటకం, జానపద గీతాలతో కళా ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ సునీల్, శానిటరీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేదదీర్చిన వాన


గోపాలపట్నం శ్మశాన వాటిక జంక్షన్ వద్ద రోడ్డుపై చేరిన వర్షం నీరు


వర్షంలో గొడుగే రక్ష..

గోపాలపట్నం : గత కొన్నాళ్లుగా ఎండలతో సతమతమయిన జనాన్ని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు సేద దీర్చాయి. మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులతో వాతావరణం చల్లబడింది. దీంతో ఉక్కపోత బాధలు తీరాయంటూ జనం ఊపిరి పీల్చుకున్నారు. గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లో వర్షాల కారణంగా రహదారులపై నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గోపాలపట్నం శ్మశాన వాటిక జంక్షన్, ఎన్ఏడీ సెటిఎల్‌కు వెళ్లే రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయింది.

పారిశ్రామిక ప్రాంతంలోను..

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో రెండు రోజుల నుండి ఓ మోస్తరుగా వర్షం పడుతోంది. దీంతో పలు సేవా మార్గాల్లో నీరు నిలిచిపోయింది. మంగళవారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.

జాగింగ్‌కు వెళ్తే.. జారుడే

మట్టి కరిగి బురదమయంగా మారిన వాకింగ్ ట్రాక్

మల్కాపురం : ఆరోగ్యం కోసం వాకింగ్‌కు వెళ్తే జారి పడేంత పనవుతోంది. దీంతో వాకింగ్‌కు వెళ్లే వారు కలవర పడుతున్నారు. వాకింగ్ ట్రాక్‌పై మట్టి చేరకుండ అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. 60వ వార్డు గుల్లలపాలెం వద్ద జీవీఎంసీ అధికారులు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. దీంతో పారిశ్రామిక ప్రాంతంలో పలువురు వాకర్లు ఇక్కడ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తు ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అయితే గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు వాకింగ్ ట్రాక్ (బీటీ రోడ్డు)ను ఆనుకుని ఐదంగుళాల ఎత్తులో మరో వాకింగ్ ట్రాక్ (మట్టి)ను వేశారు. అయితే కురుస్తున్న వర్షాలకు మట్టి వాకింగ్ ట్రాక్‌పైకి వస్తోంది. ఇది వర్షానికి బురదగా మారి నడిచే వారు జారుతున్నారు. ఆరోగ్యం కోసం వాకింగ్‌కు వస్తే ఈ పరిస్థితి ఏంట్రా బాబూ అంటు పలువురు వాకర్లు కలవరపడుతున్నారు. అధికారులు స్పందించి బీటీ వాకింగ్ ట్రాక్‌పై మట్టి రాకుండా సిమెంట్ గట్టు ఏర్పాటు చేయాలని వాకర్లు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు మహిళా పోలీసులు సహకరించాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ ఎస్.సాయి

మర్రిపాలెం : నేరాలను నియంత్రణకు సచివాలయ మహిళా పోలీసులు సహకరించాలని కంచరపాలెం సీఐ ఎస్.సాయి కోరారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. అనుమానితులు, అపరిచితులు ఎవరైనా సంచరిస్తున్నట్టు గమనించినట్టయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఒంటరిగా వెళ్తున్న మైనర్లను లక్ష్యంగా చేసుకుని నగదును,సెల్‌ఫోన్లు కాజేస్తున్నారని, అలాంటివారిపై నిఘా ఉంచాలని తెలిపారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వారి ఫొటోలు సచివాలయ మహిళా పోలీసులకు అందజేస్తామని, తద్వారా వారి కదలికలను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐలు సమీర్, రవికిషోర్, దివ్యభారతి పాల్గొన్నారు.

23న ఆర్పీ పట్నాయక్‌తో ముఖాముఖి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్‌తో ఈనెల 23న విశాఖ పౌరగ్రంథాలయంలో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలు మంగళవారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తర్వాత ప్రపంచ సినిమా పరిస్థితి అంశంపై ప్రసంగం, ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ అధ్యక్షులు ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, బి. చిన్నారావు, బాల్జి, అర్చన, గాయత్రి, కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కాంపోజిట్ మెటీరియల్స్ పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం మెరైన్ ఇంజినీరింగ్ విభాగంలో ఆచార్య వి.వి.ఎస్ ప్రసాద్, ఎం.వెంకటేష్, అభిషేక్ నల్లూరిలు సంయుక్తంగా రచించిన «డెవలప్‌మెంట్ ఆఫ్ బయో బేస్డ్ నానో పాలిమర్స్ కాంపోజిట్ మెటీరియల్స్» పుస్తకాన్ని రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని లాంబర్ట్ పబ్లిషర్స్ సంస్థ ముద్రించింది. పరిశోధనాత్మక ఫలితాల ఆధారంగా ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు. పుస్తక రచయితలను ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ అభినందించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

20న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 20న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

పదవీ విరమణ వయసు పెంపుతో హర్షం


మంత్రి కొట్టు సత్యనారాయణకు అమ్మవారి ఫొటో అందజేస్తున్న రాంబాబు తదితరులు

డాబాగార్డెన్స్ : ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా దేవాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచిన దృష్ట్యా పలువురు ఉద్యోగులు మంగళవారం దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కనకమహాలక్ష్మి దేవస్థానం ఏఈవో వెంపలి రాంబాబు, వేదపండితులు ముప్పి వేంకటేశ్వర ఘనాపాఠి, పలువురు ఉద్యోగులు అమ్మవారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.